ముసలాడి మాట

★

శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న

"అబ్బబ్బ! దిక్కుమాలిన రంధి బాగా వొచ్చి పడింది నాకు. వాళ్ళకి తోచదు; ఒకరు చెబితే అర్థం చేసుకోరు. చిన్నపిల్లలూ చితకపిల్లలూ కారుకదా, కోంపడ్డానికీ బెదిరించడానికినీ."

మహా చెడ్డ విసుక్కుంది రాజేశ్వరి. పెళ్ళి అయిన పదేళ్ళకి పుట్టింటికి వెళ్ళిందామె, అయిదేళ్ళ కొడుకుని తీసుకుని.

గత అయిదారుయేళ్ళలోనూ యెంతైనా మారిపోయిందామె. బి. ఏ. ప్యాసయి కొత్తగా కాపరానికి వొచ్చినరోజుల్లో రాజేశ్వరి అంటే ఆబాలగోపాలం ప్రాణం పెట్టేవారు. పిల్లలయితే బొత్తిగా నేను. పిల్లలంతా యెవరుండేవారనీ? తోటికోడలి కొడుకూ, కూతురూను. అయినా ఆ పిల్లలు "పిన్నీ, పిన్నీ" అంటూ యెప్పుడూ యీమె కొంగు పట్టుకునే వేళ్ళాడేవారు. చద్ది అన్నాలు పెట్టాలంటే పిన్ని; తలంట్లు పొయ్యాలంటే పిన్ని; రాత్రిళ్ళు నిద్రపోయేటప్పుడు కూడా పిన్నే. ఔను మరి. రాజేశ్వరి అంత చక్కగా కథలు చెప్పేది. అసలు కథ ఒకయెత్తూ, ఆమె చెప్పడంలో నేర్పు రెండెత్తులున్నూ. అసుర సంధ్య వేళ తిరిగి, చీకటి ముసురుకుంటూ ఉంటే అన్నాలు పెడుతూనో, వాళ్ళ పక్కని వాకిట్లో మంచంమీద పడుకునో ఆమె కథలు చెబుతూ ఉంటే, నిజంగా ఓ పెద్దకొంగ ముక్కు "ఆఁ" అని తెరుచుకుని కృష్ణుణ్ణి మింగెయ్యాలని వొచ్చినట్టూ, లేకపోతే ఓ పెద్ద చెరువులో పాము పడగమీద ఆడినట్టే ఆడి, కృష్ణుడు దాని బుర్ర కాళ్ళతో చితకతన్నుతూన్నట్టూ, అది కాస్తా 'రక్షించుమొర్రో, యింకెప్పుడూ యెవ్వరినీ అల్లరి పెట్టను' అని బతిమాలుకుంటూన్నట్టూ అనిపించేది వాళ్ళకి యేఁవిటోను. అనిపించడం ఏఁవిటి, కళ్ళకి కట్టినట్టు తెలుస్తూ ఉండేను!

అసలు కృష్ణుడు యెంత బావుండేవాడనీ?

"నాలాగ ఉండేవాడు కదూ, పిన్నీ?"

"మరేం చక్కటి కిరీటం కూడా పెట్టుకునేవాడు, ధగధగా మెరిసిపోతూను."

"కిరీటం అంటే యేఁవిటి పిన్నీ?"

"మొన్న దుష్యంతుడు వేసినప్పుడు నువ్వు పెట్టుకున్నావూ? అదీ."

"అదే బావుంది పిన్నీ, జిగేల్మంటూను"

"కిరీటం మధ్యని నెమిలిపింఛం కూడా ఉండేదిరా, కృష్ణుడికి!"

రాజేశ్వరి ఆమాట అనేసరికి వాచక పుస్తకంలో పాఠం ఆనవాలుగా పెట్టుకున్న నెమలికన్ను జ్ఞాపకం వొచ్చేది కుర్రాళ్ళకి.

"మెత్తగా యెంత బావుంటుంది, పిన్నీ, నెమలికన్నూ!" అంటూ వాపోయేడు కుర్రాడు.

"అలా యిలా తిప్పితే రంగులూ మెరుస్తాయి, తమాషాగాను!" పల్లవి పాడింది చెల్లెలు.

"ఔనౌను. ఈసారి నాకో కిరీటం కొనిపెట్టమంటాను, నాన్నగారిని."

"నాకుమాత్రం అఖ్ఖర్లేదేంటి, నాయనా? నేనూ కొనిపెట్టమంటాను, ఓ ఆడకిరీటం"

చూస్తుఉండగానే యేళ్లు పైబడుతూ వొచ్చేయి. పిల్లలకి నవలలూ నాటకాలూ అంటే యెక్కడలేని అభిరుచీ కుదిరింది. తెలుగులోనూ, ఇంగ్లీషులోనూ మార్కులు కాస్త బాగానే వొస్తూఉన్నా, పనికివొచ్చే ముక్క ఒఖ్ఖటీ ఒంటబట్టేది కాదు. లెఖ్ఖలూ అవీ అంటే వాళ్ళకి యెప్పుడూ, పీకలే, పాపం. స్కూలుఫైనలు అప్పుడే ఓసారి తప్పేరు. ఈమాటు అయినా సవ్యంగా గట్టెక్కుతారన్న భరవసా యేఁవీ కనిపించడం లేదు.

పంథొమ్మిదోయేట తాను బి. ఏ ప్యాసయి కాపరానికి వొచ్చిన కొత్తలో, వాక్చాతుర్యంకొద్దీ కథలు చెబుతూ పిల్లలని మంత్రముగ్ధులని చేసి తనవెంట తిప్పుకుంటూ ఉండేనూ, పిల్లలంటే తనకున్న ఆదరానికి అటు అత్తమాఁవలూ, యిటు భర్తా బావగారూ సంతోషిస్తూ ఉండేనూ, తను చేస్తూన్న పని యెంతో

బావున్నట్టే అనిపించింది మొదట్లోను. కాని పెద్ద క్లాసుల్లోకి వెళుతూన్నకొద్దీ పిల్లలు యెప్పుడూ పనికిరాని పుస్తకాలే చదువుతూ ఉండేవారు. రానురాను పిన్నిదగ్గిర పాఠాలు చెప్పించుకోవడం అరుదయిపోయింది. అసలు వాళ్ళు పిన్నిని అడిగేదల్లా ఏవో కఠినమయిన మాటలకి అర్థాలే. డిక్షనరీ చూసుకోమంటే "టైము వేస్టు, పిన్నీ, చెప్పేద్దూ ... మాంఛి పట్టులో ఉంది కథ" అని జవాబు! తీరా చూస్తే వీడి చేతులో ఓ యింగ్లీషు నవలా, దాని వొడిలో చిలకమర్తివారి డిటోన్ను. మరి యీ దౌర్భాగ్యులు ఎలా ప్యాసవుతున్నారా అని అనుమానం వేసి, ఒకటి రెండుసార్లు "ప్రోగ్రెసు కార్డు"లు చూసింది. భర్తతో యీ సంగతే అనేసరికి, "ఆ హైస్కూలు హెడ్మాస్టరూ మా నాన్నగారూ క్లాసుమేట్సు రాజూ" అంటూ కీలకం చెప్పేడు భర్త.

ఇహను ఆనాటినుంచీ ప్రోగ్రెసుకార్డులు చూడడం మానేసి, పిల్లలని హెచ్చరించేది చదువుకోమని. వాళ్ళు యింగ్లీషూ తెలుగూ క్షుణ్ణంగా చదివినా, లెక్కలూ వగైరాలు మాత్రం పొలిమేరల్లోనే ఉంచేసేవారు. మరీ ప్రాణం విసిగి, ఓనాడు గట్టిగా కూకలేసేసరికి, ఆడపిల్ల కంట నీరెట్టుకుంది; మొగపిల్లడు అమితంగా బెదిరిపోయి జ్వరం తెచ్చుకున్నాడు. ఉదయాన్నే టెంపరేచరు చూసి మందిస్తూ ఉంటే— "ఎంత తంటాలుపడ్డా రావడంలేదు పిన్నీ ... ఓయ్ బాబోయ్, కొట్టకండి, మాస్టారోయ్, కొట్టకండి... మా పిన్నికూడా అంది ... రేపట్నించీ యింకే పుస్తకంవూ ముట్టుకోను... లెక్కలే చేస్తాను...ఇంక కొట్టకండి, బాబూ, చ-చ్చి-పోతాను" అంటూ బావురుమన్నాడు వాడు. రాజేశ్వరి కడుపు కెలికేసింది ఆ పరాకుమాట!

అదుగో ఆనాటినుంచే ఆమెలో గొప్ప పరివర్తనం. పొరపాటునయినా పరుషంగా మాట్లాడేది కాదు, పిల్లలతోను. కథలు చెప్పిన ఆప్యాయతతోనే వాళ్ళని పక్కన కూచోబెట్టుకుని లెక్కలూ, సయన్సూ, వల్లకాడూ వసనాభి రాత్రి పన్నెండు గంటలదాకా తంటాలు పడేది.

పరిక్షలయేయి.

రిజల్ట్సు ప్రచురించేరు.

"నువ్వే మళ్ళీ ప్యాసయేవు, పిన్నీ" అన్నారు పిల్లలిద్దరూ నవ్వు మొహాల్తో.

అమాయికంగా అన్న ఆమాట ఓ పెద్ద వ్యంగ్యకావ్యం అయిపోయింది పిన్నికి. చిన్ని క్లాసుల్లో వాళ్ళకి మార్కులు తక్కువ వొచ్చినప్పుడు తనే ఫెయిలయింది. తాను మప్పిపెట్టిందేగా కథలంటే వాళ్ళకి ఆ అభిరుచీ? అంచేతే "నువ్వే మళ్ళీ ప్యాసయేవు పిన్నీ" అని వాళ్ళంటే విపరీతం అయిన నిజం యెంతో వివరంగా గోచరించింది ఆమెకి. ఇంకా నయం, కాస్త వెలుగుండగా సర్దుకోబట్టి గాని, లేకుంటే యావజ్జీవం వాళ్ళు — ముఖ్యంగా ఆ కుర్ర నాగమ్మ — యీమెని తలుచుకుని ఉసూరుమని పోయేవారు కాదూ? మళ్ళీ అదే నాటకం ఆరంభం అయ్యేలాగుంది. నేరకపోయి వొచ్చేను బాబూ, అనుకుంది రాజేశ్వరి.

2

వొచ్చి పదిరోజులే అయినా పుట్టినప్పట్నించీ తాతగారింటిలోనే పెరిగినట్టు మెసులుతున్నాడు పిల్లడు. ఇట్టే చేరికయింది వాడికి తాతగారిదగ్గిర. రోజూ సాయంకాలం ఆయనతో షికారు వెళ్ళి వొచ్చేవాడు. రాత్రిపూట ఆయన విధిగా కథలు చెబుతూ ఉండేవాడు. "అనగా వినగా చెప్పగా చెయ్యగా, అంగ వంగ కళింగ, కాశ్మీర, సౌరాష్ట్ర ఛప్పన్న దేశాల్లో...", పట్టాలమీద రెయిలుబండీలాగ, పాత ఫక్కీలో సాగిపోయేది కథ ఝుంయిమని. రాజేశ్వరికి తేళ్ళు కుట్టినట్టు ఉండేది. మొదట్లో రెండురోజులు తండ్రిమీద అభిమానంకొద్దీ ఊరుకుంది యేమీ అనకుండాను. తరవాత పిల్లడు పాడైపోతాడన్నమాట యెన్నోవిధాల సూచించింది. తన తండ్రి కాలానికీ తనకాలానికీ దృక్పథాల్లో యెంతో మార్పు వొచ్చిందన్న సంగతి ఆయనకి నచ్చజెప్పాలని వెయ్యి విధాల యత్నించింది. కాని ముసలాళ్ళు చిన్నపిల్లలకంటే అన్యాయం అయిపోతారు ఒక్కొక్కప్పుడు! ఇంతకూ డెబ్భయ్యేళ్ళ కురువృద్ధుతో ఆమె దెబ్బలాడ్లేదుగదా. కాగా, కన్నతండ్రి ఆయిరి!

ఈలోగా రాజుకొడుకూ, మంత్రికొడుకూ, జోడు గుర్రాలు యెక్కడం, అలా వెళ్ళగా వెళ్ళగా చీమదూరని చిట్టడవీ, కాకిదూరని కారడవీ, ఆమధ్య ఓ పెద్ద మర్రిచెట్టూ, దాని కొమ్మలు పట్టుకొని వీళ్ళు చెరోదిక్కుగా వెళ్ళడం, అప్సరసలూ...ఒకటేమిటి? ముసలాయన టెలివిజనే చూపించేస్తున్నాడు.

కథల నిషా బాగా తలకెక్కిపోతోంది కుర్రాడికి!

3

ఓనాడు మరి నిగ్రహించుకోలేక పోయింది, రాజేశ్వరి.

"యింక చాల్లెస్తురూ, నాన్నగారూ ఉట్టి పుణ్యానికి పాడుచేసేస్తున్నారు వాణ్ణి."

ముసలాయన పొడిగా ఓ నవ్వు నవ్వేసి తిరిగీ కథ అందుకున్నాడు.

ఆమర్నాడు తాతగారితో షికారు వెళ్ళలేదు, కుర్రాడు.

చీకటిపడి తాతగారు యింటికి వొచ్చేసరికి పిల్లడు పడమటిగదిలో పడుకున్నాడు.

భోంచేసి చుట్ట ముట్టించుకుంటూ హాల్లోకి వచ్చిన తాతగారికి బల్లమంచంమీద పిల్లడు కనిపించలేదు.

"బాబూ, కథ చెప్పుకుందాం, రావోయ్" గుండెల్లోంచి పొంగి పొరలే ఆప్యాయతతో పిలిచేడు ముసలాయన.

"వాడు పడుకున్నాడు లెండి నాన్నగారూ" రాజేశ్వరి సమాధానం యిచ్చింది.

"అఁ? ఊరు సంధ్యపడకుండా నే?"

"పోనిస్తురు, నాన్నగారూ. అలాగ కథలు అలవాటు చెయ్యడం మంచిదికాదు"

"అద్గదీ. అంచేత చంటి వెధవని కోంపడి పడుకోమన్నావన్నమాట. ఇంతకూ కథలు వినడం యెందుకు మంచిదకాదో?"

"అలా కథలు వినివిని, వాళ్ళు హీరోలయిపోయినట్టు ఊహించుకుంటూరు. కావాలన్న పనికి తగిన కృషి చెయ్యకుండా ఏవో పిచ్చిపిచ్చి ఊహలతో కాలం గడిపేస్తారు. కథల్లో ఏ అప్సరసో రాక్షసుడి ప్రాణాల భరిణ చెప్పేసినట్టు వీళ్ళకీ ఏ మహానుభావుడో అడ్డుపడతారని భ్రమిస్తారు. నిజంగా జీవితంలో అటువంటిది ఏఁవీ జరగదు. కాగా మిగిలేది ఒట్టి పేకమేడ. ఇహ నా తరవాత యెందుకూ పనికి రాకుండా పోతారు."

కూతురు హెచ్చరికకి ముసలాయన ఏఁవీ అనుకోలేదు. అమితంగా జాలిపడ్డాడు ఆమె వైఖరీ చూసి—

"అయిందా నీ ఉపన్యాసం? పిచ్చిపిల్ల! నే ఉన్నంతకాలం వాడికి ఏమీ భయంలేదు. ఇంత త్వరగా నాకేమీ రానూ రాదు. అలాంటిది ఏదయినా జరుగుతుంది అనుకున్నప్పుడు—"

"ఊరుకోండి నాన్నగారూ. ఎందు కాపాపపు మాటలు. నేనేమయినా అలాంటిది అన్నానా?" రాజేశ్వరి మనస్సు చివుక్కుమంది, మరి.

"నా కథలవల్ల వాడు చెడిపోతాడం టేనూ? చెడిపోకుండా చూసుకోడానికి యింకా బోలెడు వ్యవధి ఉంది అంటున్నాను."

"అబ్బబ్బా. ఏఁవిటా అఘాయిత్యపు మాటలు! ఊరుకోరు నాన్నగారూ?"

"ఇంతకూ కథలు వినడంవల్ల యేఁవిటా ప్రమాదం?"

"ప్రమాదం ఏఁవీ లేదు, మంచిదికాదన్నాను."

"ప్రమాదం ఏఁవీ లేనప్పుడు మంచిది కాకపోవడం ఏఁవీ?"

"ఇంక రేపు యింటికి వెళ్ళినతరవాతకూడా వాడు కథలు చెప్పమని నా ప్రాణాలు తీస్తాడు."

"ప్రమాదం ఏఁవీ లేదని ఒప్పుకుంటూన్నప్పుడు, అక్కడ నువ్వుమాత్రం యెందుకు చెప్పకూడదూ, కథలూ?"

"అదో దురభ్యాసం అయిపోతుంది నాన్నగారూ"

"ప్రమాదం లేనప్పుడు అలవాటు అయితేమాత్రం యేం?"

తండ్రీ కూతుళ్ళ సంవాదం వింటూ అంతవరకూ ఉలక్కుండా పలక్కుండా కూచున్న భర్త వసారాలోంచి ఫకాలుమన్నాడు.

రాజేశ్వరికి అవమానం, పౌరుషం ముంచుకొచ్చేయి.

"మరీ చిన్నపిల్లలకన్నా కనిక్లిష్టం అయిపోతున్నారు. నాన్నగారూ, మీరూ మీపంతమున్నూ"

"పంతంకాదు, అమ్మాయీ నీకూ విద్యాబుద్ధులు చెప్పించేను. బి. ఏ ప్యాసయేవు. నేనూ పట్టా పుచ్చుకున్నవాణ్నే — ఎప్పుడో నువ్వు పుట్టకముందు లే. అంచేత విషయం తర్కిస్తున్నాం అన్నమాట. అంతేగాని నాకు పంతం దేనికే? అందులోనూ నీతోను!"

"ఏమయినా మీరు నాలుకాలాలు చూసిన వాళ్లు. అంచేత నామాట తిరిగీ నాకే వప్పచెప్పే నేర్పు—"

"నేర్పూ లేదు గీర్పూ లేదు. ఇటుచూడు, అమ్మాయీ కథలవల్ల ప్రమాదం ఏఁవీ లేదూ అనుకున్నప్పుడు మరేపుట్టీములకొకూడా రాదుసుమీ అని నచ్చజెప్పాలనీ నా ప్రయత్నం అంటాను. ఇంతకూ పుట్టిన అయిదేళ్ళకి తొలిసారిగా నాలుగు రోజులు నాదగ్గిరున్నాడు వాడు."

"ఆడది, దాంతో ఏఁవిటి పోనిస్తురు, మాఁవగారూ" అన్నాడు భర్త.

రాజేశ్వరి ఘర్రుమంది. "ఆఁహ్. ఆడవాళ్ళు! మీరున్నారుకదూ మొగవాళ్ళు! అటు మీరూ, యిటు నాన్నగారూ, గదిలో బాబులూ — అంతా మొగాళ్లే. ఒక్క నేనే ఆడదాన్ని. మీరెంత మెజారిటీలో ఉన్నా నా అభిప్రాయం మారదుగాక మారదు."

రాజేశ్వరిని మరి కాస్త రెచ్చగొడదాం అనిపించింది భర్తకి. అతనికి అదో అలవాటు. ఏడుస్తూన్న వాళ్ళని మరి కాస్త యేడిపిస్తాడు—"అవునూ. కథలు వినడంలో ప్రమాదం లేదంటూ—"

"చాల్లెండి, ఉన్న గేడె కూడా యీ నిందా అనీ? మీవొంతు ఉండిపోయిందా యేఁవిటి యింక? కాకపోయినా రెండు నిమిషాలు యెవరయినాపట్టుగా మాట్లాడితే ఔను అదే రైటు అని తల వూపేస్తారు మీరు. వీడుకూడా పరిక్షలు తగలేస్తూ ఉంటే—"

"అలాంటి అభాసు ఏదయినా జరుగుతుం దనుకున్నప్పుడు నువ్వన్నమాటే; వొప్పుకుంటాను. కాని కథలు వింటే ప్రమాదం ఏఁవీ లేదని నువ్వే అన్నావుగా?"

ఇంక రాజేశ్వరికి విసుగెత్తింది. అంతలో పడమటి గదిలోంచి పిల్లడు పిలిచినట్టయింది. "నువ్వింకా పడుకోలేదురా, నిశిరాత్రి అవొస్తూ ఉంటేనూ?"

ఆమె విసుక్కుంటూ చరచరా లోపలికి వెళ్ళిపోయింది.

4

"వాడికి నా దగ్గిర చేరికయింది. అసలు కథలంటే సరదా లేని పిల్లలు యెవరుంటారు చెప్పూ? చూడు, పాపం వాడు యెలా యేడుస్తున్నాడో"

"ముసలాయనకి ఏఁవిటో చెయ్యి విరగ్గొట్టుకున్నట్టుంది, పక్కన పిల్లడు లేకపోవడం.

"ఆడవాళ్లంతా అంతే, పోనిద్దురు మాఁవగారూ."

"నేను దగ్గిరగా మెసిలిచూసిన ఆడవాళ్ళంతా యెవరూ? అటు నీ అత్తగారూ, యిటు నీ భార్యానూ. వీళ్ళిద్దరిని బట్టీ లోకంలో ఆడవాళ్ళంతా అంతే అని పాటా పెట్టెయ్యడం సబబుకాదనుకో. కాని చూడు, వాళ్ళు అదోరకం మనుష్యులు. విన్నన్నా చెప్పిందే వేదం, వాళ్ళతోను. ఇంక దానికి మంచీ, చెడ్డా, విమర్శా యేవల్లకాడూ అక్కర్లేదు."

"ఒట్టి బండలు పోనిస్తురు, మాఁవగారూ" నిజంగా అతని గుండెల్లోంచి వొచ్చిన మాటకాదది. రాజేశ్వరి అంటే అతనికీ పంచప్రాణాలూను. నెత్తినే యెక్కించుకునే వాడు ఆమెని. కాని ప్రస్తుత పరిస్థితుల్లో మాఁవగారి మనోవ్యాకులం—చూళ్ళేక అలా అనేసేడు.

కాని ముసలాయనది మహా నిశితం అయిన తర్కం. "బండలైనా బావుండి పోను", ఆయన సున్నితంగా విమర్శ ప్రారంభించేడు," "బండ మారు పలకదు. కాని వీళ్ళతో అలాగ కాదుగా! ఒకమాటకి పదిమాటలు జవాబు చెబతారు, వీళ్ళు, యెంత అసందర్భంగా వున్నా సరే ఆ మాటలు."

ముసలాయన యింకా తర్కం సాగిస్తూనే ఉన్నాడు. అవతల పడమటింట్లో రాజేశ్వరి పిల్లడితో నోరుచేసుకుంటోంది. నిజానికి ఆమె పిల్లడిని అంతలాగ యెన్నడూ కసిరి యెరగదు. ఆవేళఅయినాఅంత త్వరగా కోపంవొచ్చి ఉండకపోను, ఆమెకి. కాని గంటన్నర అయి అనవసరంగా తండ్రిలో వితండవాదనతో ఓ కొంతా, తీరా పోనీ అని వొదిలేస్తే తోటికోడలి పిల్లల్లాగే వీడూ చెడిపోతాడేమోనని భయంతో మరి కొంతా ఆమెకి మతిపోయింది. ఆమెలో ఆమెకే విసుగెత్తింది. చివరకి కోపంగా పరిణమించింది.

కాని ఆ గాథ అంతా కుర్రాడికి యేం తెలుసూ? యెన్నడూ కన్నెర్రజెయ్యని తల్లి గట్టిగా కోంపడేసరికి వాడు కాస్తా బావురుమన్నాడు ఒక్కసారి.

"శని వెధవ, యెలా యేడుస్తున్నాడో. ఎవరైనా వింటే బలవంతాన్న పిక నులిమిచంపేస్తున్నాం

అనుకొంటారు." రాజేశ్వరికి కోపం, చికాకూ ప్రశమించి పోయేయి.

ఆ చివరి మాటలు కాస్తా ముసలాయన చెవిని పడ్డాయి. "ఆఁ. ఇరుగూ పొరుగూ వినిపోతారేమో నన్న భయం కాస్త ఉందన్నమాట" అనుకున్నాడు. అంతలో ఆయనకి యేదో ఆలోచన తట్టింది. ఫక్కున నవ్వేడు.

అల్లుడు తెల్లబోయేడు.

"అబ్బే, యేఁవీ లేదూ. జీవితంలో ముఖ్యం అయిన విషయం ఏఁవిటో గ్రహించేవూ, పిల్లలతండ్రి వయేవు!" అన్నాడు మాఁవగారు.

అల్లుడికి యేమీ పాలుపోక, దిగాలుపడి చూస్తూ ఉండిపోయేడు.

"వొంటికి పాతికేళ్ళు వొచ్చేయే నీకు, ఇన్నాళ్ళూ యేఁవిటి కావాలనిపించింది నీకు?" ముసలాయన ముదలకించేడు.

"అనేకం."

"అవునా? నీ చేతుల్లోనే ఉంటే అవన్నీ అనుభవించేవాడివన్నమాట. ఏం?"

"బహుశా అలాగే జరిగిఉండేది"

"కాబట్టి నీకు కావలసిందల్లా ఒక్కటే, స్వేచ్ఛ. నీ యిష్టం వొచ్చినపని చెయ్యడానికి ఏ అభ్యంతరం ఉండకూడదు. దాని పేరే స్వేచ్ఛ"

ఈ మాటల్లో అంతరార్థం దూరంగా దృగ్గోచరం అయింది అల్లుడికి.

"అదేనోయ్ జీవితంలో కీలకం. స్వేచ్ఛ. ఆ సేచ్ఛకోసం దేవుళ్లాడతాడు జీవి పుట్టినదగ్గిర్నుంచీని. పుట్టగానే ఏం చెయ్యడానికీ శక్తి ఉండదుగా. అంచేత యేడుస్తావు. మీ అమ్మకి రెండు చెవులంటూ యిచ్చేడు భగవంతుడు. అంచేత ఆ యేడుపుతో నీకు కావలసింది లభిస్తుంది అప్పట్లో. చంటిపిల్ల బహు సున్నితం అయిన వస్తువు మరి. ఆ సున్నితం సాధారణంగా మనకి తెలిసి యేడవదు. అందుకు దాని దారి అది చూసుకోవడానికని యిదో మార్గం పెట్టేడు భగవంతుడు. ఆ తరవాత యెప్పుడైతే యితర సాధన ద్వారా తన కోరిక నెరవేర్చుకో గలుగుతాడో అప్పుడు ఏడ్చి సాధించడం మానేస్తాడు పిల్లడు."

ముసలాయన లెక్చరు విని, అంతవరకూ చెలరేగిన తుఫాను అకాత్తుగా మరిచిపోయేడు అల్లుడు. మాఁవరాకడ యేదో వింతగానే ఉంది.

"మీరు చెప్పిందంతా బాగానే ఉందిగాని, యీ యేడ్చి సాధించడం అనేది రానురాను పంతంగొట్టుతనంగా పరిణమిస్తుందేమో నని నా భయం, మాఁవగారూ! పంతగొట్టుతనం యేం అంత మంచి గుణఁవా మరీ?" అల్లుడూ తన లోకజ్ఞానం వెల్లడించేడు.

"మాట పొరపాటుగా వాడేవు" మాఁవ ఠకీమని అందుకున్నాడు, "పంతగొట్టుతనం అని మనం భ్రమపడేది పట్టుదలకి బీజం. పిల్లడికి జ్ఞానం తెలుస్తూన్న కొద్దీ కొత్తలక్షణాలు అబ్బుతాయి. ముఖ్యంగా సంతోషం, రోషం తెలుస్తాయి. వాడికి సంతోషం పెల్లుబికి వొచ్చినప్పుడు చప్పట్లు కొట్టాలనిపిస్తుంది. రెండు చేతులతోనూ వాడు బాజాలు వాయించేస్తాడు. "వొద్దు, వొద్ద"ంటూన్నా వాడికి మేడమెట్లు యెక్కాలనిపిస్తుంది. తల్లి ఏ పప్పో బియ్యఁవో బాగుచేసుకుంటూ ఉంటే వీడు చల్లగా జారిపోయి మెట్లవేపు ఉడాయించేస్తాడు. తల్లి తలయెత్తి చూసేసరికి వీడు బాగా పదిమెట్లు యెక్కిపోతాడు. "ఒరే, ఒరే" అంటూ నివారించబోతుంది తల్లి. వాడి వెనకాల పరిగెడుతుంది. కాని వాడో? సింహంలాగ మెడ వెనక్కి తిప్పి తల్లివేపు చూసి నవ్వుతాడు, తన కోరిక నెరవేర్చుకున్నందుకూ, పట్టుదల నెగ్గినందుకున్నూ."

"ఇందులో నిజానిజాలు యెలాగ ఉన్నా మీ తర్కం మాత్రం మా తమాషాగా ఉంది, మాఁవగారూ!"

"ఇంకొక్క మాట చెబుతాను వినవోయ్. ఈ పట్టుదలే తరువాత తరవాత జీవితంలో యెక్కువగా ఉపకరిస్తుంది. పెరిగి పెద్దవాడు అవుతూన్న కొద్దీ పదిమందీ తను చేసినపని మెచ్చుకోవాలనీ, నలుగురిలోనూ తనమాట 'ఔ' నని పించుకోవాలనీ కోరిక పుడుతుంది. ఆ తంటాలుపడడంలో వాడు నెగ్గేడా, సంఘఁవూ ప్రపంచఁవూ వాడికి అంజలి ఘటిస్తుంది. లేదూ, వాడు యెందుకూ కొఱగాకుండా పోతాడు. ప్రస్తుతం వొచ్చిన చిక్కేఁవిటీ అంటే, తనమాట నెగ్గించుకునే యీడు రాలేదింకా వాడికి; అది కాస్తా మళ్ళిపోయింది నాకు. దానాదీనా కథ మిగిలేపోయింది."

5

పడమటింటి గదిలో తల్లీ కొడుకూ యింకా యేదో గలభా పడుతూనే ఉన్నారు.

ముసలాయన ఉన్నట్టే ఉండి సెటు మార్చేడు.

"అమ్మాయీ" అని ఓ పొలికేక పెట్టేడు, ఊరు కాలిపోయినంత గొడవ చేస్తాను!

ఎదరనున్న అల్లుడు అదిరిపడ్డాడు.

పడమటింటి గదిలోంచి పరిగెత్తుకు వొచ్చింది, రాజేశ్వరి, "ఏఁవిటి, నాన్నగారూ? ఏఁవిటయింది?" అంటూను.

"ఏఁవీ కాలేదు. ఏమయినా అయితే యీ గొడవంతా యెందుకూ? కుర్రవాడి కథ మిగిలేపోయింది." ముసలాయన వ్యాఖ్యానించేడు.

"అబ్బ! ఊరుకుందురు, నాన్నగారూ, మళ్ళీ మొదలెట్టకా. ఆ విషయంలో యింక యివాళ మన అభిప్రాయాలు కలియవు."

"ఆయన మాట అంత తేలిగ్గా కొట్టిపారెయ్యకు, రాజూ, ఆయన చెప్పినదాంట్లో యెంతో అర్థం ఉంది." భర్త కాస్త నచ్చజెప్పపోయేడు.

"చాలూరుకుందురూ. నాన్నగారివన్నీ పాతకాలపు మాటలు. అప్పటికీ యిప్పటికీ కాలం మారిపోయింది, మరి.!"

"కాని కథలంటే అభిరుచీ, పిల్లలతో ఆడుకోవాలన్న ఉబలాటం ముసలాళ్ళలో మాత్రం మారలేదే, అమ్మాయ్" ముసలాయన తిరిగీ ఉపక్రమించేడు.

"ఉట్టి పుణ్యానికి యెందుకూ పనికిరాకుండా పోతాడు, నాన్నగారూ. నామాట వినరూ?" రాజేశ్వరి ప్రాధేయపడింది.

"అదే, యెంచేతా అంట"

రాజేశ్వరి తనతోటికోడలి పిల్లల యితివృత్తం అంతా పూసగుచ్చినట్టు చెప్పింది. "దైవకృపవల్ల వాళ్ళియేడు గట్టెక్కబట్టిగాని, లేకపోతే—" మాట ముగించలేకపోయింది ఆమె. "ఇంతకూ కథలూ అవీ అంటే ఆ వ్యామోహం కలిగించింది నేనేగా" అంటూ కంట తడి పెట్టుకుంది.

ముసలాయనకి గుండె కరిగిపోయింది. కూతుర్ని ఒడిలోకి తీసుకుని, ఎంతో ఆప్యాయంతో తల నిమురుతూ అన్నాడు, "ఒస్స్! ఈ జిజ్ఞాసలో పడి నీలో హృదయాన్ని చంపుకుంటున్నావా, అమ్మా! కథలు వినడంవల్లా, నవలలు చదవడంవల్లా ఫెయిలయిపోలేదు వాళ్ళు. మిగతా సబ్జక్టున్న అశ్రద్ధ చేసినందువల్ల పరీక్ష తప్పేరు. కథలూ కబుర్లూ చెప్పి చిన్నప్పుడు వాళ్ళని తల్లికంటే యెక్కువగా నీ చేతుల్లో తిప్పుకున్నావని నువ్వే అంటున్నావా? వాళ్ళకి నువ్వంటే అంతలాగ అభిమానఁవూ ప్రేమా యేర్పడ్డప్పుడు, మంచిమాటలతోనే వాళ్ళు తప్పుడుతోవ పట్టకుండా చూడొచ్చునుగా! ఆ సంధ్యా సమయాల్లో వాళ్ళపక్కన పడుకుని ఆ కథలతోపాటు, యెక్కాలూ మానాలూ అవీ యివీ కూడా చెబితే ఎంత బాగుండిపోను! హిస్టరీ అంతా కథల్లోనే చెప్పొచ్చునే, యెముకలకి పట్టిపోయి, మరిచిపోదాం అన్నా మరుపురాకుండా ఉండేటట్టు!"

రాజేశ్వరి కళ్ళు విప్పారేయి. రెప్పవాల్చకుండా చూస్తోంది తండ్రి ముఖం. ఆయన ఆడిన ప్రతీమాటా శ్రుతిపుటాల్లోపడి, సూటిగా గుండెల్లోకి దిగి నాటుకుపోతోంది. ఆయన అలా చెప్పుకుపోతూనే ఉన్నాడు—

"సయన్సూ అవీ అయితే—చిన్న క్లాసుల్లో ఉన్నప్పుడు — వాళ్ళతో ఆడుకున్నట్టే ఆడుకుని ప్రయోగాలు చేయించి, ఎప్పుడూ నిన్నే పాఠాలు చెప్పమనేటట్టు — ఎంతెంతటి అవకాశాలు ఉన్నాయో గ్రహించేవూ? అయితే అప్పుడు నీకూ చిన్నతనం. అంచేత తెలియక పొరపాటు జరిగిపోయింది. జ్ఞానం తెలిసేక, చేసిన పొరపాటు సవరించుకున్నావు. కాని అంతమాత్రాన హృదయం చంపుకోవలసిన పనియేఁవుందీ? ఎవడో సైకిలుయెక్కి కాలు విరగ్గొట్టుకున్నాడని సైకిళ్ళే నిషేధించేస్తే యేంబావుంటుంది చెప్పు, అమ్మాయీ?"

రాజేశ్వరికి ఒక్కసారి సత్యం స్ఫురించింది.

సంతత ధారాపాతంగా అశ్రువులు చెక్కిళ్ళవెంబడి జారేయి. ఆమె శరీరం అణువు అణువునా కృతజ్ఞతతో కంపించిపోయింది. ఒక్క అంగలో పడమటిగదిలోకి పరిగెత్తింది, రాజేశ్వరి.

ముసలాయన చిర్నవ్వుతో వెంబడే వెళ్ళేడు.

"బాబూ" గద్గదికతో పిలిచింది తల్లి.

"తాతగారింకా రాలేదే అమ్మా?" యెంతో జాలిగా, దీనంగా అడిగేడు పిల్లడు.

"ఇంకా నిద్రపోలేదురా, భడవా!" నవ్వుతూ అన్నాడు తాత.

"నిన్న చెబుతానన్న కథ చెప్పవ్ తాతా?"

"అందుకే వొచ్చేన్రా, బాబూ, నువ్వు యింకా మేలుకున్నావో లేదో చూద్దాం అని."